# మార్పు

–కె. విజయలక్ష్మి

బాలభానుడు తెరచివున్న కిటికీల్లోకి కొంటెగా జొరబడి ఆదమరచి నిద్రిస్తున్న వారిని చురుక్కున తాకి చటుక్కున లేపుతున్నాడు.

కలల లోకాలలో విహరిస్తూ తన్మయత్వంతో మునిగితేలుతూ ఏదో అస్పష్టంగా గొణుగుతున్న ప్రణయ్‌ని చురుక్కున తాకి కిలకిలా నవ్వాడు.

ఉలిక్కిపడి కళ్లిప్పేసరికి అందమైన నల్లరాతి శిల్పంలా రత్తాలు కనిపించింది.

'గుడ్‌మార్నింగ్!' తనకి తనే చెప్పుకుని ప్రక్కనేవున్న టీపాయ్ మీది సిగరెట్ తీసుకుని వెలిగించుకున్నాడు.

పనిమనిషి రత్తాలు అటూ ఇటూ తిరుగుతూ చకచకా పని చేస్తోంది.

చీరకుచ్చెళ్ళు ఎత్తి బొడ్లో దోపిందేమో కాలిపిక్కలు నగ్నంగా నిగనిగలాడుతున్నాయి. బలమైన నడుముని చుట్టుకున్న పైట చెంగు, కొసదేరిన ముక్కుకి తళుక్కుమనేలా తెల్లరాయి పుడక ఆ అందమైన ముఖానికే ఒక అందం.

దట్టంగా కాటుక పులిమిన నల్ల కలువల్లాంటి చేరడేసి కళ్ళు...నల్లటి నుదుటిపై ఎర్రటి సూర్యుడిలా ప్రజ్వలిస్తున్న కుంకుమ బొట్టు, బిగించి అల్లిన జడలో రాత్రి నలిగిన మూరెడు మల్లెలు, నడుస్తున్నప్పుడు లయగా కదులుతున్న శరీరం...వ్వాహ్! ఎంత అందం!

వయ్యారంగా కదిలే ఆమె అందాల్ని అతని చూపులు నిలువెల్లా తడుముతున్నాయి. అతని ఎక్స్‌రే కళ్ళు ఆమె దుస్తుల్ని సైతం దాటి ఆమె శరీరాన్ని కాంక్షగా స్పృశిస్తోంది.

ఇరవై ఏళ్ళ రత్తాలు శరీరాన్ని ఆ చూపులు సూదుల్లా గుచ్చినట్టుంది. ఏడాదిగా ఆ ఇంట్లో పని చేస్తున్నా తొలిసారిగా ఆ చూపులు కొత్తగా, ఇబ్బందిగా, అదోలా అన్పించినా ఆమె గమనించనట్లు పని చేసుకుపోతోంది.

ప్రణయ్‌కి పెళ్లయి ఏడాదయింది. భార్య శ్రీజ వారం క్రితమే పురిటికెళ్లింది.

మొదటిసారిగా భార్యని విడిచి అన్నిరోజులుండడం అదే. వీలు కుదిరినప్పుడు శ్రీజని కౌగిట్లో బిగించనిదే నిద్రపోని ప్రణయ్ పది లంఖణాలు చేసినవాడిలా వున్నాడు. తోడులేక అదోలా అయిపోతున్నాడు.

ప్రణయ్‌కి రొమాంటిక్ ఫీలింగ్స్ ఎక్కువేమో భార్య ఐదునెలలవరకూ రాదు అన్న ఆలోచనే భరించలేకుండా వున్నాడు. అంతవరకూ శివరాత్రి జాగరణే అనుకోగానే గుండె బాదుకున్నాడు.

ఆ తరుణంలోనే నల్లనేరేడు లాంటి రత్తాలు అందాలు అతన్ని కవ్విస్తూ వూరించాయి. ఆమెను చూడగానే, ఆమాటకొస్తే ఏ ఆడదాన్ని చూసినా వళ్ళంతా సెగలు జిమ్ముతూ అదో మారిదిగా అవుతుంది. సిగరెట్ చివరికంటా కాలి చేతిని చురుక్కుమనిపిస్తే ఆలోచనల్నుంచి తెప్పరిల్లాడు.

పనంతా ముగించిన రత్తాలు దగ్గరకు వచ్చింది. అతని శరీరం జివ్వుమంది. ఆమె నుండి తేలివచ్చే రాత్రి మల్లెల వాసన మైకం తెప్పిస్తోంది. మనసు ఏవో తీయని ఆలోచనలని రేకెత్తిస్తోంది.

''బాబూ! పనంతా అయిపోయింది. ఇంటికిపోతున్నా'' అతని చూపుల్లో కాంక్షని కనిపెట్టిన రత్తాలు...ఇదివరలోలా అతనికేసి చూస్తూ మాట్లాడలేక చూపుని బొటనవేలు మీదే నిలిపి అంది.

అతని దృష్టి ఆమె వంటిమీద తారట్లాడుతోంది. ఎగిసే చిలిపి కోర్కెని బలవంతాన అణచుకుని ''మళ్ళీ రేపొస్తావు కదూ!'' బెంగ తీరనట్లుగా అన్నాడు.

ఆమె విస్మయంగా చూసి తలాడించి వెళ్లిపోయింది.

రాత్రి పదిగంటలయింది. నిద్రరాక బెడ్‌మీద అటూ ఇటూ దొర్లుతున్నాడు ప్రణయ్.

సుడిగాలిలా బెడ్‌రూమ్‌లోకి దూసుకొచ్చింది రత్తాలు. ఆ సమయంలో రత్తాలు ఒంటరిగా తన బెడ్‌రూమ్‌లో...అతనిలో కోర్కెని రగిల్చింది.

కాంక్ష నిండిన కళ్ళు మెరుస్తుంటే పెదవుల మీద అదోలాంటి నవ్వుతో రత్తాలు వేపు చూసాడు.

లేచి కూర్చుని ''నాతో పనా?'' అదోలా అడిగాడు.

తలొంచుకుని నిలబడ్డ రత్తాలుకి అతని మాటలకి అర్థం తెలుసుకునే స్థితిలోలేదు.

''రత్తాలూ! మాట్లాడవే'' అతని గొంతులోని మార్దవానికి ఒక్కసారిగా బరస్టయింది.

''బాబూ! తమరే నా మావని కాపాడాలి. తమరే రచ్చించాలి'' భోరున ఏడుస్తూ కుప్పకూలిపోయింది.

ప్రణయ్ కంగారు పడిపోయాడు.

ఆమె ఏడ్పుకి కారణం తెలీక, ఆమెని ఎలా ఓదార్చాలో అర్థంకాక తలొంచుకుని ఏడుస్తున్న ఆమెని చూస్తూ కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు.

''నీ మావకి ఏమైంది?'' కొన్ని నిముషాల తరువాత అడిగాడు.

''వున్నట్టుండి కడుపులో నొప్పని పడిపోయాడు బాబూ. ఆసుపత్రికి తీసికెళ్తే పెద్ద డాక్టరుగారు ఆప్రేషన్ చేయాలన్నారు. మూడువేలవుద్దన్నారు. ఆటో రిక్షాతొక్కినయ్, నేను పని చేసినయ్ నా దగ్గర రెండేలున్నాయి.''

ప్రణయ్ ఆమెకేసే చూస్తున్నాడు. ఒక్షణమాగి బొడ్లో దోపిన పైటకొంగు తీసి కళ్ళు తుడుచుకుంది.

''తవరు వెయ్యి రూపాయలిప్పిస్తే నెలనెలా నా జీతంలో కట్టేసుకోండి బాబూ'' దీనంగా వేడుకుంది.

ప్రణయ్‌ని ఒక్కసారిగా ఆలోచనలు చుట్టుముట్టినాయి. రత్తాలు అవసరాన్ని తనకి అనుకూలంగా మార్చుకుంటే? ఎస్! అటు రత్తాలు మావ ఆరోగ్యంతో బయటపడతాడు. మూడోకంటివాడికి తెలీకుండా తన కోరిక తీరుతుంది. ప్రణయ్ మౌనం చూసి ఆమె హృదయం భాధగా మూలిగింది.

''చూడు రత్తాలూ! నీక్కావాల్సిన డబ్బు నేను సర్దుతానుగానీ...''

అతన్ని పూర్తిగా చెప్పనీయకుండానే ''తవరు దేవుళ్ళు బాబూ...దేవుళ్ళు'' అంది.

''నేను దేవుడ్ని కాదు, మనిషిని. ఉప్పుకారం తినే మామూలు మనిషిని. భార్య తోడులేని మగాడ్ని. ఒక్కసారి నా కోరిక తీర్చి, డబ్బు పట్టుకెళ్లి నీ మావని రక్షించుకో.''

నెత్తిన పిడుగు పడ్డట్టు ప్రూన్పడిపోయింది రత్తాలు. పెళ్లాం ప్రక్కనుంటే శ్రీరామచంద్రుళ్ళు, పెళ్లాం కనుమరుగైతే రావణాసుళ్ళవుతారేమో ఈ మగజాతి. డబ్బు మరెక్కడైనా దొరుకుతుందేమోనని ఆమె మనసు గాలిస్తోంది. కానీ..ఎక్కడా...ఎక్కడా అవకాశంలేదు. రెక్కాడితేగానీ డొక్కాడని తమలాంటి బడుగు మనిషిని నమ్మి అప్పెవరిస్తారు?

తమ దగ్గర పొలమా, పుట్రా? ఇల్లా వాకిలా? కనీసం తాకట్టు పెట్టడానికైనా చిన్నమెత్తు బంగారం తన దగ్గర లేదు. తనని నమ్మి అప్పెవరిస్తారు? ఎలా ఇస్తారు?

దిక్కుతోచక ఆమె చిగురుటాకులా కంపిస్తోంది. ఆసుపత్రి అరుగుమీద నొప్పితో గిలగిలా కొట్టుకుంటున్న మావ కళ్లముందు కదలగానే ఆమె హృదయం కదిలిపోయింది.

అంగీకరించడానికి మనసు, శరీరం ఎదురు తిరుగుతున్నాయి. కానీ...కానీ చూస్తూ చూస్తూ దేవుడులాంటి మావని, మనసున్న మంచి మావని, తనంటే మరులున్న మావని ఎలా పోగొట్టుకుంటుంది?

తమ గుడిసెల్లో మనుష్యులా ఏనాడూ తాగి తన మీద చేయి చేసుకోలేదు. బాడుగు చూసుకుని సరాసరి ఇంటికొచ్చేవాడు.

'రత్తాలు నీకోసం తెచ్చానే' అంటూ మల్లె పూలు, బజ్జీల పొట్లం చేతిలో పెట్టి ఆ గుడ్డి వెలుగులోనే కళ్లల్లో కళ్లెట్టి ప్రేమగా చూసేవాడు.

''నువ్వు ఆళ్లింట్లో పని చేయడం నాకిష్టంలేదు. ఏం...నిన్ను నేను బ్రతికించుకోలేనా? పువ్వుల్లో పెట్టి చూసుకోకపోయినా నా గుండెల్లో పెట్టుకుని చూసుకోగలను. కానీ నువ్వేమో రేపు పిల్లలు పుడితే నీ ఒక్కడి సంపాదన ఎలా సరిపోతుందంటూ నా మాట లెక్కచేయవు?''మురిపెంగా విసుక్కుని మళ్లీ వెంటనే ''రత్తాలూ! నువ్వెంత తెలివైనదానివే. ఏ జన్మకైనా నువ్వే నా పెళ్లానివి కావాలి. నాకు తోడునీడగా ఉండాలి'' అంటూ అపురూపంగా వాటేసుకునేవాడు.

ఆ సంఘర్షణలో ఆమె మనసు వోడిపోయింది.

''మీ ఇష్టం బాబూ?'' అంది విధిలేక.

''రత్తాలూ!'' తమకంగా ఆమె భుజంమీద చెయ్యేసాడు.

ఆమె శరీరం ఒక్కసారిగా జలదరించింది.

అతన్ని దూరంగా నెట్టేసి ''బాబూ! ఇది సరసాలకి సమయం కాదు. ముందు డబ్బివ్వండి. డాక్టర్గారికిచ్చొచ్చి మీ కోరిక తీరుస్తాను'' ప్రాధేయపూర్వకంగా అంది.

ప్రణయ్ ఒక్కసారిగా చల్లబడిపోయాడు. చేసేది లేక డబ్బు ఆమె చేతిలో వుంచాడు.

మిలమిలలాడే కళ్లతో కృతజ్ఞతగా అతనికేసి చూసి బయటకు పరుగుతీసింది.

'బిచ్...ఎంత పని చేసింది. నమ్మబలికి డబ్బు రాబట్టుకుని మోసం చేసింది'. కోరికతో నరాలు చిట్లిపోతున్న ప్రణయ్ ఈ నెలరోజుల్లో కొన్నివందలసారు తిట్టుకున్నాడు.

''రత్తాలక్క రేపట్నుంచి పనిలోకొత్తానని మీతో సెప్పమంది'' పదేళ్ళ అమ్మాయి వచ్చి చెప్పింది. ఆ మాట ప్రణయ్ మనసులో పన్నీటి జల్లు కురిపించింది. ఆరోజు రాత్రి వచ్చింది రత్తాలు. తెల్లచీర, తెల్ల జాకెట్టు, నూనెరాసి నున్నగా దువ్విన తలలో సువాసనలు వెదజల్లుతూ మల్లెలు, నల్లటమ్మాయి అయినా ఏదో తెలీని అందం, ఆకర్షణ ఆమెలో వున్నాయి. వస్తూనే అతని మెడ చుట్టూ చేతులేసి ముద్దు పెట్టుకుంది. ఆమె నడుం చుట్టూ చేతు లేసి బిగిస్తూ ''ఐ లవ్ యూ'' అన్నాడు.

''నాకూ అంతే బాబూ! మీరంటే నాకెంతో ఇది'' గోముగా అంది.


''ఇంత ఇదిని ఇన్నిరోజులు ఎలా దాచుకున్నావు?'' ముక్కును పట్టి సుతారంగా అటూ ఇటూ వూపుతూ అడిగాడు.

''దేన్నికైనా కాలం కలిసి రావాలి బాబూ'' కళ్ళు మూసుకుని కౌగిలిలో హాయిని అనుభవిస్తూ అంది.

మాటలతో పని లేనట్టు మౌనంగా వుండిపోయాడు ప్రణయ్. ఇంతలో ఎవరో తలుపులు దబదబా బాదుతున్న చప్పుడయింది.

వులిక్కిపడి లేచాడు ప్రణయ్. అతని చేతిలో దిండు నలుగుతోంది. ఇదంతా కలా అనుకోగానే నిరాశగా మూలిగింది మనసు. లుంగీ సరిగ్గా కట్టుకుని తలుపు తీసాడు. ఎదురుగా రత్తాలు.

అమాంతం కాళ్ళమీద పడిపోయింది.



''బాబూ! తమరి దయవల్ల మావ బతికాడు. మీరు దేవుడు బాబూ...దేవుడు. నా మాంగల్యం కాపాడిన భగవంతుడు మీరు. కదల్లేని మావని ఒక్కడ్నీ మంచం మీద వదిలి రాలేక పనిలోకి రాలేదు బాబూ. నేను మాట తప్పే మనిషిని కాదు బాబూ. మోసగత్తెను అంతకంటే కాదు బాబూ. రాత్రికి తప్పక వస్తాను.'' ప్రణయ్ పాదాలని రత్తాలు కన్నీటితో కడుగుతోంది.

''రత్తాలూ! ఇదేం పని పైకి లే'' వెనక్కి జరిగాడు. ఆమె లేచి నిలబడింది. ఆమెని పరిశీలనగా చూసి ఉలిక్కిపడ్డాడు ప్రణయ్. రత్తాలు శుష్కించిన శరీరంతో జబ్బు చేసిన దానిలా నీరసంగా వుంది. నల్లగా నిగనిగలాడే ఆ అందం, చలాకీతనం ఆమెలో ముచ్చుక్కైనా లేవు. మావ బ్రతికాడన్న ఆనందం కాబోలు కళ్ళు కాంతులీనుతున్నాయి. భర్త ప్రాణం కోసం ఏ స్త్రీ చేయకూడని పనికి రత్తాలు సాహసిస్తే తను...తనేం చేసాడు? భార్య పది రోజులు దూరమైతే పరాయి స్త్రీ పొందుకోసం పరుగులు తీస్తున్నాడు. సెక్స్ జీవితంలో ఒక భాగమని, జీవితమే సెక్స్ కాదని చదువుకున్న తనెందుకు అర్థం చేసుకోలేకపోయాడు.

'మగాడికి సెక్సే జీవితమైతే, స్త్రీకి భర్తే జీవితమా? కావచ్చు...కానీ సెక్స్ కోసం మగాడు సంస్కారహీనంగా ప్రవర్తించడం పశుత్వమనిపించుకుంటుంది. ఆమె త్యాగానికి, నిర్మల ప్రేమకి ముగ్ధుడయి లోపలికి వెళ్లి మరో వెయ్యి తెచ్చి ఆమె చేతిలోవుంచి ''రత్తాలు! నీ గుడిసెకెళ్లి నీ మావని జాగ్రత్తగా చూసుకో.

ఆ... మరోమాట రాత్రికి నువ్వు రానక్కర్లేదు'' అన్నాడు దృఢంగా.

★